RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:57 17-8-2025 ఆదివారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /-

## ప్రధాని మోదీ అబద్ధాల కోరు.. జైరామ్ రమేశ్ ఫైర్



ఆగస్టు 16(టుడే విదుర):కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సమాచార విభాగం అధినేత జైరామ్ రమేశ్ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఇచ్చిన ప్రసంగంలో.. ఇండియా సెమీ కండక్టర్ చరిత్ర గురించి తప్పుడు ఆరోపణలు చేశారంటూ మండిపడ్డారు. ప్రధాని మోదీ అబద్ధాల కోరు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జైరామ్ రమేశ్ తన ఎక్స్ ఖాతాలో నిన్న(శుక్రవారం) ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో..

'ప్రధాని మోదీ అబద్ధాల కోరు అని చెప్పడానికి ఇది మరో ఉదాహరణ. సెమీ కండక్టర్ కాంప్లెక్స్ లిమిటెడ్ చండీగఢ్‌లో ఏర్పాటైంది. 1983లో ఆపరేషన్స్ మొదలయ్యాయి' అని అన్నారు. ఆ పోస్టులో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగానికి సంబంధించిన వీడియోను కూడా జోడించారు. ఆ వీడియోలో నరేంద్ర మోదీ సెమీ కండక్టర్ల గురించి మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. 'నేను టెక్నాలజీకి సంబంధించిన పలు విషయాల గురించి మాట్లాడినపుడు.. సెమీ కండక్టర్ల గురించిన ఉదాహరణను మీ దృష్టికి తీసుకువస్తాను.

## అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ప్రముఖుల పుష్పాంజలి



న్యూఢిల్లీ, ఆగస్టు 16(టుడే విదుర):: భారతరత్న అవార్డు గ్రహీత, భారతదేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి దేశం యావత్తూ ఇవాళ అంజలి ఘటిస్తోంది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఉదయం (శనివారం) 'సదైవ్ అటల్' (స్మారక చిహ్నం) సమాధి వద్ద మాజీ ప్రధానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్‌లో మోదీ.. భారతదేశ పురోగతి పట్ల వాజ్‌పేయి నిబద్ధత.. అభివృద్ధి చెందిన, స్వావలంబన కలిగిన దేశాన్ని నిర్మించే ప్రయత్నాలను కీర్తించారు. . 'అటల్ జీని తన పుణ్య తిథి సందర్భంగా గుర్తుచేసుకుంటున్నాను. భారతదేశ సర్వతోముఖాభివృద్ధికి ఆయన అంకితభావం, సేవా స్ఫూర్తి.. భారతదేశాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరినీ ప్రేరేపిస్తూనే ఉన్నాయి' అన్నారు.

## బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదన్న కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 16(టుడే విదుర): బిల్లుల ఆమోదం విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టు గడువు విధించటం అనే అంశంపై కేంద్రం స్పందించింది. అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా ఆమోదించేలా కోర్టులు వారిని నిర్దేశించవచ్చా? అన్నదానిపై సుప్రీంకోర్టు నోటీసులకు కేంద్రం బదులిచ్చింది.బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ల ఆమోదానికి గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదని కేంద్రం.. సుప్రీంకోర్టుకు విన్నవించింది. కొన్ని అంశాల్లో కోర్టులు జోక్యం చేసుకుంటే రాజ్యాంగపరంగా గందరగోళం తలెత్తే అవకాశం ఉందని కేంద్రం తెలిపింది. బిల్లుల అంగీకారం అంశంలో కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంది. బిల్లులపై గడువు విధింపుతో రాష్ట్రపతి, గవర్నర్ల అత్యున్నత స్థానాన్ని తగ్గించినట్లు అవుతుందని కూడా కేంద్రం అభిప్రాయపడింది.ఆ రెండు స్థానాలు ప్రజాస్వామ్య పాలనకు ఉన్నత ఆదర్శాలు అని చెప్పిన కేంద్రం.. వారి విధుల్లో ఏవైనా లోపాలు ఉంటే న్యాయ జోక్యాల కంటే.. రాజ్యాంగపరమైన యంత్రాంగం ద్వారా సరిదిద్దాలని సుప్రీంకు కేంద్రం తెలిపింది.

## ఉచిత బస్సు కేవలం ప్రయాణం కాదు.. నారా లోకేష్




అమరావతి ఆగస్టు 16(టుడే విదుర):: 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళల కోసం కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకాన్ని కానుకగా ప్రకటించింది. సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన ఈ పథకాన్ని ప్రారంభించడం గర్వంగా ఉందని మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.ఎక్స్ లో చేసిన పోస్టులో ఇలా రాసుకొచ్చారు. ఉచిత బస్సు టికెట్ అనేది నమ్మకానికి నిదర్శనం... స్వేచ్ఛకు, గౌరవానికి ప్రతీక. ఇది ప్రయాణం కాదు ఓ కదలిక, స్వేచ్ఛాయుత, సమాన అవకాశం. స్త్రీ శక్తి ద్వారా ఏపీ ప్రభుత్వం మహిళల సాధికారితకు పట్టంకట్టింది. సోదరసోదరీమణులారా...ఈ ప్రయాణాన్ని వేడుకగా నిర్వహించుకుందాం. మీ ఫ్రీ బస్సు టికెట్ తో సెల్ఫీ దిగి ఈ ప్రపంచానికి సాధికారిత అంటే ఎలా ఉంటుందో చూపించండి అంటూ ట్వీట్ చేశారు.

## రియల్ లైఫ్‌కి రా నాయనా.. సిద్ధార్థ్ రెడ్డికి అఖిల ప్రియ కౌంటర్..




కర్నూలు, ఆగస్టు 16(టుడే విదుర):: వైఎస్ జగన్, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డిపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందుల జెడ్పీటీసీ ఓటమితో జగన్ మైండ్ బ్లాంక్ అయినట్లుందని సెటైర్లు వేశారు. శనివారం నాడు కర్నూలులోని మహిళా జైలును సందర్శించారు భూమా అఖిల ప్రియ. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. జగన్‌పై విరుచుకుపడ్డారు. జగన్ మానసిక పరిస్థితి బాగోలేదని చాలా మంది అనుకుంటున్నారని అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికలతో అక్కడి ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందన్నారు. ఇవే చివరి ఎన్నికలు అని జగన్ భయపడుతు న్నారేమో అంటూ సెటైర్లు వేశారు. చంద్రబాబు పాలనను ఎవరు అడ్డుకోలేరన్నారు. వందేళ్ల వరకు ప్రజలు బాగా ఉండాలని చంద్రబాబు నిత్యం కష్టపడుతున్నారని అఖిల ప్రియ చెప్పుకొచ్చారు. చంద్రబాబును విమర్శించే ముందు వైసీపీలో నాయకులు ఉంటారో లేదో జగన్ తెలుసుకోవాలని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పక్కా ఆధారాలతోనే లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్‌లు జరుగుతున్నాయని చెప్పారు. అర్ధరాత్రి గోడలు దూకి ఎవరిని అరెస్టు చేయడం లేదన్నారు.

## 30 ఏళ్లుగా ఏపీలో ఉగ్రవాదులు.. అరెస్ట్ చేసిన ఐబీ అధికారులు



సత్యసాయి ఆగస్టు 16(టుడే విదుర):: జిల్లా కేంద్రంలో ఉగ్ర కదలికలతో తెలుగు రాష్ట్రాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. అయితే.. ఇప్పటికే ఉగ్రవాది మహ్మద్ షేక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఏపీలో ఉగ్ర కదలికలపై నిఘా వర్గాలు, ఏపీ పోలీసులు ఫోకస్ పెట్టారు.ఇంకా ఉగ్రవాదులు ఉన్నారు..

ధర్మవరంలో నూర్ మహమ్మద్ షేక్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మహమ్మద్‌కు పాకిస్తాన్‌కు చెందిన జైషే మహమ్మద్ అనే ఉగ్రవాద సంస్థతో లింకులు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) గుర్తించింది. భారతదేశంలో నిషేధించిన ఉగ్రవాద సంస్థలకు చెందిన వాట్సప్ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నట్లు ఐబీ అధికారులు పేర్కొన్నారు. ముస్లిం యువతను అతడు ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆన్లైన్ కాల్స్ ద్వారా పాకిస్తాన్‌లోని జైషే మహమ్మద్, ఇతరులతో మాట్లాడినట్టు వివరించారు. అలాగే.. ఏపీలో ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(సిమీ) ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్న స్టూడెంట్స్‌ను గుర్తించినట్లు అధికారులు చెప్పారు.

## వైఎస్ భారతి కూడా ఫ్రీ బస్సులో ప్రయాణించవచ్చు.. మాజీమంత్రి కీలక వ్యాఖ్యలు



అమరావతి: ఆగస్టు 16(టుడే విదుర): ఆడబిడ్డలను వృద్ధిలోకి తీసుకురావాలన్న సిద్ధంతామే తెలుగు దేశం పార్టీ విధానమని ఏపీడబ్ల్యూజేఎఫ్ ఛైర్ పర్సన్, మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. ఆనాడు ఎన్టీఆర్ మహిళల హక్కుల కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు డ్వాక్రా అనే విత్తనం వేసి.. నేడు కోటి మంది మహిళలు వాళ్ల కుటుంబాలకు ఆసరగా నిలిచేలా చేశారని ఆమె తెలిపారు.మహిళలకు అవకాశాలు కల్పిస్తే ఏదైనా చేస్తారు, అద్భుతాలు సృష్టిస్తారని పీతల సుజాత ధీమా వ్యక్తం చేశారు. మహిళల కోసం స్త్రీ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు రాష్ట్ర మహిళల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి మహిళలకు ఇచ్చిన కానుక స్త్రీ శక్తి పథకమని పేర్కొన్నారు. రాఖీ పండుగలా ఈ స్త్రీ శక్తి పథకాన్ని కూడా మహిళలంతా చిరస్థాయిగా గుర్తుపెట్టుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళల కోసం ఇలాంటి మంచి పథకాన్ని ప్రవేశపెడితే వైసీపీ పేటీఎం బ్యాచ్ వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్త్రీ శక్తి పథకంపై విమర్శలు చేయడం వైసీపీ నాయకుల దిగజారుడు తనానికి నిదర్శనమని విమర్శించారు.

# తండ్రి అప్పు తీర్చలేదని కుమార్తె కిడ్నాప్

**సీసీ ఫుటేజీతో స్వల్ప వ్యవధిలోనే ఛేదించిన పోలీసులు**
**తల్లిదండ్రుల చెంతకు బాలిక.. అదుపులో ఫైనాన్స్ వ్యాపారి**

ఒంగోలు క్రైం,ఆగస్టు 16(టుడే విదుర): తండ్రి అప్పు తీర్చలేదని ఎనిమిదో తరగతి చదువుతున్న 13 ఏళ్ల ఆయన కుమార్తెను ఓ వ్యాపారి కిడ్నాప్ చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు రెండు గంటల వ్యవధిలోనే కేసును ఛేదించారు. ఒంగోలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ దామోదర్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం మువ్వావారిపాలేనికి చెందిన శ్రీనివాసరావు గతంలో బేల్దారి పనులకు తిరుపతి వలస వెళ్లాడు. ఆసమయంలో తిరుపతికి చెందిన ఆర్.ఈశ్వరరెడ్డి వద్ద రూ.5లక్షలు అప్పుతీసుకున్నాడు. కొంతకాలంగా ఆ బాకీ చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో శు క్రవారం చీమకుర్తి వచ్చిన ఈశ్వర్‌రెడ్డి నేరుగా శ్రీనివాసరెడ్డి కుమార్తె చదువుకునే పాఠశాల వద్దకు వెళ్లాడు. అక్కడ స్వాతంత్ర్యదిన వేడుకలకు హాజరై బయటకు వస్తున్న ఆ బాలికకు.. 'మీ నాన్న ఇంటికి తీసుకురమన్నాడ'ంటూ మాయమాటలు చెప్పి మధ్యాహ్నం 12.30 గంటలకు మోటారు సైకిల్‌పై ఎక్కించుకున్నాడు. స్వీట్లు కొనిస్తానని చెప్పి దారిమళ్లించి ఒంగోలుకు తీసుకువచ్చాడు. ఈ దృశ్యం సీసీ కెమెరాలో రికార్డయింది. అక్కడి నుంచి శ్రీనివాసరావుకు ఫోన్‌చేసి 'మీ కుమార్తెను తీసుకెళుతున్నా.. నాకు ఇవ్వాల్సిన నగదు ఇవ్వకపోతే చంపేస్తా' అని బెదిరించాడు. వెంటనే శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు అప్రమత్తమయ్యారు. ఎస్పీ దామోదర్ స్వీయ పర్యవేక్షణలో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సీసీ ఫుటేజీ ఆధారంగా కిడ్నాపర్ తిరుపతికి చెందిన ఆర్.ఈశ్వరరెడ్డిగా గుర్తించారు. అతడి ఫోన్ ట్రాక్ చేసి నెల్లూరు జిల్లా కావలి సమీపంలోని కె.బిట్రగుంట వద్ద మధ్యాహ్నం 2.30 గంటలకు అదుపులోకి తీసుకొన్నారు. కిడ్నాప్ అయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

# నేరం అంగీకరించిన డాక్టర్ నమ్రత



తెలంగాణ,ఆగస్టు 16(టుడే విదుర) : దేశ వ్యాప్తంగా కలకలం సృష్టించిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసుకు సంబంధించి డాక్టర్ నమ్రత నేరం అంగీకరించినట్లు కన్ఫెషన్ రిపోర్ట్‌లో పోలీసులు పేర్కొన్నారు. కన్ఫెషన్ రిపోర్ట్ ద్వారా కేసుకు సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ కన్ఫెషన్ రిపోర్టు ప్రకారం డాక్టర్ నమ్రత ఏం చెప్పిందంటే " 1998లో మొదటిసారి విజయవాడలో ఫెర్టిలిటీ సెంటర్‌ను స్థాపించాను. 2007లో సికింద్రాబాద్లో రెండో బ్రాంచ్‌ను ప్రారంభించాను. ఆ తర్వాత వైజాగ్‌లోనూ మరో ఫెర్టిలిటీ సెంటర్‌ను ప్రారంభించాను. నా రెండవ కుమారుడు జయంతి కృష్ణ న్యాయవాదిగా ఉంటూ సహకరించేవాడు. " డాక్టర్ నమ్రత సరోగసి పేరుతో రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలను వసూలు చేశారు. ఏజెంట్లను నియమించుకొని పిల్లలను కొనేవారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు డబ్బులను ఆశచూపి శిశువు విక్రయానికి ఒప్పందం చేసుకునేవారు. ప్రసవం తర్వాత బాలింతల నుంచి పిల్లలను కొనుగోలు చేశారు. ఆ పిల్లలను సరోగసి ద్వారా పుట్టినవారిగా నమ్మించారు. పై విషయాలతో పాటు.. పలు పోలీసు స్టేషన్లలో తనపై కేసులు నమోదైనట్లు నమ్రత ఒప్పుకున్నారు.

# తమ్మిలేరుకు పెరిగిన వరద



**చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే వద్ద వరద ఉధృతి**
**కొనసాగుతున్న వర్షాలు**

చాట్రాయి/చింతలపూడి, ఆగస్టు 16(టుడే విదుర):: తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు తమ్మిలేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరిగింది. వరద ఉధృతి కారణంగా మండలంలోని కోటపాడు, చింతలపూడి మండలం పోతునూరు, చీపురుగూడెం, మల్లాయిగూడెం గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రానికి తమ్మిలేరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 3400 క్యూసెక్కులు ఉందని, ప్రస్తుత నీటి మట్టం 344 అడుగులు కాగా, ప్రాజెక్టు సామర్థ్యం 355 అడుగులు అని ప్రాజెక్టు ఏఈ లాజర్‌బాబు తెలిపారు. 352 అడుగులకు చేరితే వరద నీటిని దిగువకు విడుదల చేస్తామన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ: బంగాళాఖాతంలో ఏర్పడి న అల్పపీడన ప్రభావంతో వర్షాలు కొనసాగుతున్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా పోలవరం మండలంలో 24.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 4.6 మి.మీగా నమోదయింది. చాట్రాయి 24.2, వేలేరు పాడు 21, కామవరపుకోట 14.2, కొయ్యలగూడెం 11, జంగారెడ్డి గూడెం 9.6, టి.నరసాపురం 5, లింగపాలెం 3.8, కుక్కునూరు 3.8, బుట్టాయిగూడెం 2.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా జిల్లాలో వర్షం కురిసిన మిగిలిన మండలాల్లో 2 మి.మీ కన్నా తక్కువగానే వర్షపాతం నమోదైంది.

ఆక్వా రైతుల్లో ఆందోళన

కలిదిండి: భారీ వర్షాలు కురు స్తుండడంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. రొయ్యల చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ కొరత ఏర్పడడంతో పాటు పలు వ్యాధులు, వైరస్ సోకే ప్రమాదం ఉండడంతో చెరువుల్లో నిరంతరాయంగా ఏరియేటర్లను తిప్పుతున్నారు. ట్రంప్ సుంకంతో రొయ్యలకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వైరస్ సోకి రొయ్యలు చనిపోతే భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. పలు గ్రామాల్లోని చెరువుల్లో ఆక్సిజన్ లోపించి చిన్న సైజు రొయ్యలు చనిపోతుండడంతో హడావిడిగా పట్టుబడి చేసి ఏలూరు, ఆకివీడు మార్కెట్‌కు తరలించి అయిన కాడికి

# ఆటోలు బతికేదెలా ?



నార్పలఆగస్టు 16(టుడే విదుర): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ ప్రభుత్వం ఆగస్టు 15 నుండి శ్రీ శక్తి పథకాన్ని అమలు చేయడంతో మహిళలందరూ బస్సులనే ఎక్కుతున్నారు. దీంతో మండల కేంద్రమైన నార్పల లో ఆటోలు వెలవెలబోతున్నాయి. ఈ సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ . పరిస్థితి ఇలాగే కొనసాగితే తమ కుటుంబాల పోషణ సంగతేమో కానీ ఆటోల కంతులు కూడా చెల్లించలేమని వాపోయారు. ఆటోలనే నమ్ముకుని కుటుంబ పోషణ చేసుకుంటున్న తమ కుటుంబాల పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం ఆటోవాలాలకు రుణ సౌకర్యం కల్పించి తమ కుటుంబాల్ని ఆదుకోవాలని కోరారు. ఇక నుండి ప్యాసింజర్ ఆటోలు తీసేసి లగేజ్ ఆటోలు తెచ్చుకుంటున్నామని తెలిపారు. కనీసం ఇప్పటికైనా ఆటో వారిపై ఆర్టీఏ అధికారులు పోలీసుల దాడులు ఆపాలని కోరారు. బస్సు సౌకర్యం లేని గ్రామాలలోనైనా ఆటోలు తిప్పుదామంటే ఒక్కొక్క గ్రామానికి పదుల సంఖ్యలో ఆటోలు సీరియల్ లో ఎక్కువగా ఉన్నాయని అన్నారు.

# నా చావుకు ఖాకీలే కారణం



కళ్యాణదుర్గం,ఆగస్టు 16(టుడే విదుర):: తన చావుకు ఖాకీలే కారణమంటూ నిండు గర్భిణి ఫోనలో వాయిస్ రికార్డు చేసి, ఆత్మహత్య చేసుకుంది. పట్టణంలో మూడు నెలల గర్భిణి శ్రావణి (22) ఈనెల 14 ఫ్యానకు ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. భర్త, అత్తమామల వేధింపులు, పోలీసుల నిర్లక్ష్యంతోనే చనిపోతున్నట్లు ఆమె ఫోనలో రికార్డు చేసుకున్న ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనను ఎస్పీ జగదీష్ సీరియస్‌గా పరిగణించారు. బాధ్యులపై విచారణకు ఆదేశించారు. కళ్యాణదుర్గానికి చెందినశ్రావణికి ఇదే పట్టణానికి చెందిన శ్రీనివాసులుతో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆరునెలలపాటు దంపతులు సంతోషంగా ఉన్నారు. ఆ తరువాత అత్తమామలు కర్రెమ్మ, శివప్ప.. దంపతుల మధ్య గొడవలు పెట్టసాగారని శ్రావణి తల్లిదండ్రులు రామాంజినమ్మ, నాగరాజు వాపోయారు. పెద్దల సమక్షంలో పంచాయితీ చేసినా గొడవలు మాత్రం ఆగలేదు. చివరకి శ్రావణిని చంపాలని పెద్ద కుట్ర పన్నారు. తనను చంపాలని భర్త, అత్తమామలు చూస్తున్నారని శ్రావణి చెప్పిందని ఆమె తల్లిదండ్రులు ఆవేదన చెందారు. ఇదే విషయమై పట్టణ పోలీసు స్టేషనలో ఈనెల 11న ఫిర్యాదు చేశారు.శ్రావణి వాయిస్ రికార్డులో పోలీసులు తన కేసును తప్పుదోవ పట్టించారని వాపోయింది. ఫిర్యాదును పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారు. ఫిర్యాదును తన భర్త, అత్తమామలకు అనుకూలంగా రాశారని కన్నీరు పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ఆమె ఈనెల 14న సాయంత్రం తన పుట్టింట్లో చీరతో ఫ్యానకు ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకుంది.శ్రావణి ఆత్మహత్య చేసుకునే ముందు మొబైల్ ఫోన్లో వాయిస్ రికార్డు వింటే కన్నీళ్లు తిరుగుతాయి. నా భర్త, అత్తమామలే నా చావుకు కారణం. నేనే ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్లిపోతున్నా. నా మూడేళ్ల బిడ్డ పర్థితకైనా న్యాయం చేయండి. పోలీసులు నా ఫిర్యాదును పట్టించుకోలేదు. తప్పుదోవ పట్టించారు. ఇక.. చనిపోతున్నా... ఇక సెలవు అంటూ కన్నీటి పర్యంతమైంది. ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో శ్రావణి భర్త శ్రీనివాసులు, అత్తమామలు కర్రెమ్మ, శివప్పను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు సమాచారం.

# కేరళలో భారీ వర్షాలు : ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

తిరువనంతపురం,ఆగస్టు 16(టుడే విదుర): కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భారత వాతావరణ శాఖ ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఎర్నాకులం, ఇడుక్కి, త్రిస్సూర్, కన్నూర్, కాసరగోడ్ జిల్లాకు భారత వాతావరణ శాఖ శనివారం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇక మిగిలిన తొమ్మిది జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. 11 నుంచి 20 సెంటిమీటర్ల వర్షం కురిసే అవకాశం ఉ న్నప్పుడు ఆరెంజ్ అలర్ట్.. 6 నుంచి 11 సెంటిమీటర్ల వరకు కురిసే వర్షపాతానికి ఎల్లో అలర్ట్‌ను ఐఎండి జారీ చేస్తుంది. ఇలాంటి వాతావరణం నేపథ్యంలో 40 కిలోమీటర్ల మేర బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు రాజస్థాన్‌లో మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రతినిధి శనివారం తెలిపారు. ఉదరుపూర్, జోదాపూర్‌లో రాబోయే ఐదు రోజుల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కోటా, అజ్మీర్, జైపూర్, భరత్‌పూర్, బికనీర్‌లలో తేలికపాటి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తూర్పు రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే పశ్చిమ రాజస్థాన్‌లో మోస్తారు వర్షం.. కొన్ని ప్రదేశాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. గడచిన 24 గంటల్లో పాలి జిల్లాలో బాలిలో 70 మి.మీ వర్షపాతం నమోదైందని ఐఎండి పేర్కొంది.వర్షాకాల (ప్రారంభమైనప్పటి నుండి (జూన్ 20) హిమాచల్ ప్రదేశ్‌లో 257 మంది చనిపోయారు. 37 మంది గల్లంతయ్యారని హిమాచల్ ప్రదేశ్ విపత్తు నిర్వహణ శాఖ తెలిపింది.

# అదిగో పులి.. ఇదిగో తోక...



వేంపల్లె(కడప)ఆగస్టు 16(టుడే విదుర): అదిగో చిరుత, ఇదిగో చిరుతలు ఉన్నాయంటూ అలిరెడ్డివల్లె, వేంపల్లె రైతులు భయాందోళన చెందుతున్నారు. వేంపల్లె మండల పరిధిలోని పాపాఘ్ని నది అవతలున్న అలిరెడ్డిపల్లె సమీపంలోని ఎద్దలకొండ వెనుకవైపున అలిరెడ్డిపల్లె, వేంపల్లెకు చెందిన రైతులకు పొలాలు ఉన్నాయి. వెనుకాలే శేషాచల అడవులు ఉన్నాయి. కొద్దిరోజులుగా దూరంగా చిరుతలు కనిపిస్తున్నాయన్న అనుమానం రైతులకు రాత్రి దూరంగా రెండు చిరుతలు కనిపించాయంటూ పలువురు భయానికి గురయ్యారు. ఈ విషయాన్ని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ బాలసుబ్రహ్మణ్యం, డీఆర్ఓ వెంకట సుబ్బయ్య దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే డీఆర్ఓ వెంక టసుబ్బయ్య ఆధ్వర్యంలో శుక్రవారం శేషాచల అడవులలోని చుట్టుప క్కల గాలించారు. %అక్కడున్న కాలిగుర్తులు బట్టి అవి చిరుతలు కావని, ఇతర జంతువులు ఉంటాయని అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో చిరుతలు లేవని.. ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని రేంజర్ తెలిపారు. కొత్త జంతువులు ఏవైనా కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

# భవనం పైనుంచి పడి తాపీమేస్త్రి మృతి




వెంటాడ, ఆగస్టు 16(టుడే విదుర): వెంటాడ మండల కేంద్రంలో ప్రభుత్వ హైస్కూల్ భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ తాపీ మేస్త్రీ మృతిచెందాడు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం అడపాక గ్రామానికి చెందిన గురజాపు అప్పారావు (32) అనే తాపీ మేస్త్రి భవనం పై నుంచి జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను వెంటనే గజపతినగరం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆంధ్ర ఎస్ఐ సీతారాం తెలిపారు.

# హమ్మయ్యా.. బతికాం!



**గెడ్డలో కొట్టుకుపోతున్న వ్యక్తులను కాపాడి ఒడ్డుకు తీసుకొస్తున్న యువకులు**

**కాపాడిన యువకులు**

**వంతెన నిర్మించాలని గిరిజనుల డిమాండ్**

మక్కువ రూరల్, ఆగస్టు 16(టుడే విదుర): దుగ్గేరు గ్రామం సమీపంలోని అడారి గెడ్డలో కొట్టుకు పోతున్న ఇద్దరు వ్యక్తులను స్థానిక యువకులు కాపాడి క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. అయితే ఈ ఘటనలో వారి బైక్ మాత్రం వరద ఉధృతిలో కొట్టుకుపోయింది. వివరాల్లోకి వెళ్తే.. పనసభద్ర పంచాయతీ పరిధి గిరిశిఖర గ్రామం పొయ్యమాలకి చెందిన చోడిపిల్లి చంద్ర బైక్‌పై ఉదయం తన బంధువుతో కలిసి మక్కువ ప్రాంతానికి వెళ్లాడు. స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా గిరిజన హాస్టల్‌లో చదువుతున్న తమ పిల్లలను చూసి సాయంత్రం తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యలో అడారి గెడ్డపై ఉన్న కాజ్‌వేను దాటి వెళ్లేందకు ప్రయత్నించాడు. అయితే గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఒక్కసారిగా అక్కడ వరద ఉధృతి పెరిగింది. దీంతో వారు అదుపు తప్పి గెడ్డలో జారిపడ్డారు. బైక్‌తో సహా కొంతదూరం కొట్టుకుపోయారు. ఇది గమనించిన గుంటభద్ర గ్రామానికి చెందిన యువకులు ఒక్కసారిగా గెడ్డలోకి దూకి వారిద్దరినీ కాపాడారు. క్షేమంగా ఒడ్డుకు చేర్చడంతో అక్కడకున్నవారంతా ఊపిరిపీల్చుకున్నారు. గాయాలేమీ కాకపోవడంతో వారు వేరే వాహన సాయంతో ఇళ్లకు చేరారు. కాగా గుంటభద్రతో మరో పలు గ్రామాల గిరిజనులు అడారు గెడ్డపై తాడును కట్టి ఒక్కొక్కరుగా కాజ్‌వేను దాటి ఇళ్లకు చేరుకున్నారు. ఏటా వర్షాకాలంలో తమకి ఈ ఇబ్బందులు తప్పడం లేదని, తక్షణమే ఈ ప్రాంతంలో వంతెన నిర్మించాలని వారు కోరుతున్నారు.

# ఇళ్ల మధ్య సెల్ టవర్ వద్దు..

**సెల్ టవర్‌కు వ్యతిరేకంగా సంతకాలు చేస్తున్న స్థానికులు**



ముసునూరుఆగస్టు 16(టుడే విదుర): మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో నివాస గృహాల మధ్య నిర్మిస్తున్న సెల్ టవర్‌ను తక్షణమే నిలిపివేయాలని స్థానికులు అధికారులను కోరారు. కలెక్టర్ వెట్రిసెల్వి, నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న, ఎంపీడీవో సత్యనారాయణలకు స్థానికులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ వులిబళ్ళ లక్ష్మీసత్యనారాయణ, ఇన్‌చార్జ్ కార్యదర్శి సయ్యద్ మోబీనల ఆధ్వర్యంలో గ్రామసభ జరపగా సభకు హాజరైన 200 మంది సెల్ టవర్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నట్టు అధికారుల సమక్షంలో సంతకాలు చేసి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తక్షణమే టవ ర్ నిర్మాణాన్ని పూర్తిగా తొలగించాలని, లేకుం టే మండల కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నివేదికను ఉన్న తాధికారులకు అందజేయనున్నట్లు ఇన్‌చార్జ్ కార్యదర్శి తెలిపారు. రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజిం గ్ సెక్రటరీ మానురాజు సురేష్, వార్డు సభ్యురాలు ఎం.కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.


# 2,050 హెక్టార్లలో వరి పంట మునక

**ఉంగుటూరు మండలం కైకరంలో జాతీయ రహదారి పక్కన మునిగిన పంట చేలు**



ఏలూరుసిటీ, ఆగస్టు 16(టుడే విదుర):బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గత రాత్రి నుంచి భారీగానే వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి కొంత వర్షాలు శాంతించినా తిరిగి సాయంత్రం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా సార్వా వరి సాగులో 2,050 హెక్టార్లలో వరి పంట ముంపునకు గురైందని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. భీమడోలు మండలంలో 140, ఉంగుటూరు 1,740, దెందులూరు 20, పెదపాడు 32, నిడమర్రు 118 హెక్టార్లలో వరి పంట మునిగిపోయింది. దాదాపు 1135 రైతులకు చెందిన ఈ వరి పంట వివిధ దశల్లో ఉండగా ముంపునకు గురైందని, ప్రస్తుతం వరి పంటకు నష్టం వాటిల్లే అవకాశాలు లేవని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా నిడమర్రు మండలంలో 182.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 65.5 మి.మీ గా నమోదైంది. ఉంగుటూరు 159.6, పెదవేగి 134.6, భీమడోలు 103.6, ఏలూరు అర్బన్ 97.8, దెందులూరు 89.4, ద్వారకాతిరుమల 89.4, జీలుగుమిల్లి 88, ఏలూరురూరల్ 85, ముసునూరు 78.8, కామవరపుకోట 75.6, పెదపాడు 70, చింతలపూడి 57.2, చాట్రాయి 55.6, లింగపాలెం 53.6, టి.నరసాపురం 47.2, ముదినేపల్లి 45.6, ఆగిరిపల్లి 45.2, నూజివీడు 41.4, కైకలూరు 41.2, మండవల్లి 7.8, జంగారెడ్డిగూడెం 37, కలిదిండి 36.8, వేలేరుపాడు 25.6, బుట్టాయిగూడెం 20.4, కొయ్యలగూడెం 16.2, పోలవరం 10.6, కుక్కునూరు 8.4 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

# భయం భయంగా విధులు



ఆలూరు, ఆగస్టు 16(టుడే విదుర): తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. భవనం బ్రిటీష్ కాలంలో నిర్మించిది కావడతో శిథిలావస్థకు చేరింది. పైకప్పు నుంచి వర్షపునీరు లీకేజీ కావడంతో సిబ్బంది బక్కెట్లను ఏర్పాటు చేశారు. స్లాబ్ పూర్తిగా దెబ్బతినడంతో సపోర్ట్‌గా పెద్ద దూలాన్ని ఏర్పాటు చేశారు. అ భవనంలో పనిచేయలేమని ఉద్యోగులు అప్పటి ఆర్డీవో రామలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్వయంగా పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలోకి మార్పు చేయాలని సూచించగా, చిన్నదిగా ఉండటంతో రికార్డులు ఉంచేందుకు అణువుగా లేదని రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపలేదు. అధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

# లంబసింగి ఘాట్ రోడ్డులో కూలిన భారీ వృక్షం



చింతపల్లి :ఆగస్టు 16(టుడే విదుర): మండలంలోని లంబసింగి ఘాట్ రోడ్డులో ఉదయం భారీ వృక్షం కూలి రహదారికి అడ్డంగా పడింది. వర్షాల కారణంగా మట్టి నానిపోయి చెట్టు వేరులతో సహా కూలిపోయింది. దీంతో చింతపల్లి-నర్సీపట్నం మార్గంలో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పర్యాటకులు, స్థానిక ప్రయాణికులు రెండు వైపులా ఇరుక్కుపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న చింతపల్లి పోలీసు, అటవీ శాఖ సిబ్బంది, స్థానిక గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని గొడ్డళ్లు, రంపాలతో కోసి చెట్టును తొలగించారు. దాదాపు రెండు గంటల శ్రమించి చెట్టును పూర్తిగా తొలగించడంతో ట్రాఫిక్ పునరుద్ధరిం చబడింది.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

**ఆళ్లగడ్డ సమీపంలో ఢీకొన్న రెండు ప్రైవేటు బస్సులు**

**%27 మంది ప్రయాణికులకు గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం**

నంద్యాల/ఆళ్లగడ్డ, ఆగస్టు 16(టుడే విదుర): నంద్యాల జిల్లాలో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులు మృతి చెందగా.. మరో 27 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలో ఆల్ఫా ఇంజనీరింగ్ కళాశాల వద్ద తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో రెండు ప్రైవేటు బస్సులు ఢీకొన్నాయి. దీంతో ఒక్కసారిగా రెండు బస్సుల్లో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. దీంతో వెంటనే తోటి ప్రయాణికులు పోలీసులకు సమాచారమందించడంతో ఆళ్లగడ్డ పోలీసులు అక్కడి చేరుకుని వైద్యచికిత్సల నిమిత్తం ఆళ్లగడ్డ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్సల నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాదుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు.

# దొడ్లేరులో కలెక్టర్, ఎస్పీ పరిశీలన



క్రోసూరు ఆగస్టు 16(టుడే విదుర):: దొడ్లేరులో చెరువు కట్ట తెగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు, డిఎస్పీ హనుమంతరావు ఆదేశించారు. భారీ వానల నేపథ్యంలో గ్రామాన్ని వారు సందర్శించారు. పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని, గంటకి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. రెవెన్యూ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో విఆర్ఒ, విఆర్ఎలు ఉండాలని ఆదేశించారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు.

# ఈ రోడ్డును కాస్త పట్టించుకోండి



జమ్మలమడుగు, ఆగస్టు 16(టుడే విదుర): జమ్మలమడుగులోని తాడిపత్రి- కోవెలకుంట్ల వెళ్లే రోడ్డులో మూడు రోడ్ల కూడలి వద్ద గుంతలు పడి వర్షపునీరు నిలిచి తీవ్ర అసౌకర్యంగా మారింది. దీంతో కోవెలకుంట్ల రోడ్డు నుంచి ద్విచక్ర వాహనాల్లో వెళ్లేవారు రోడ్డు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే బస్సులు, ఇతర భారీ వాహనాలు వెళ్లేటపుడు గుంతల్లో నిలిచిన నీరు వాహనదారులు, పాదాచారు లపై పడి ఇబ్బందులు కలుగుతోందని స్థానికులు వాపోతున్నారు. సంబందిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రత్యేక చొరవ చూపి రోడ్డుపై పడిన గుంతలుపూడ్చించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత స్తంభాలు



గుమ్మఘట్ట, ఆగస్టు 16(టుడే విదుర): మండలంలోని గోనబావి బీసీ కాలనీలో పలు మెయిన లైన విద్యుత స్తంభాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో ఇక్కడ నివాసముంటున్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ ఈదురు గాలులకు ఏ క్షణంలో స్తంభాలు కూలి.. ప్రమాదం సంభవిస్తుందోనని భయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. విద్యుతశాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రధానోపాధ్యాయులుగా వాసు దేవయ్య బాధ్యతల స్వీకరణ



సోమల(చిత్తూరు)ఆగస్టు 16(టుడే విదుర): సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా(ఎఫ్ఏసి) వాసు దేవయ్య శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. గత నెల 31వ తేదీ అప్పటి ప్రధానోపాధ్యాయులు పదవీ విరమణ చెందడంతో తరువాత సీనియర్ ఉపాధ్యాయులు వాసుదేవయ్యను డీఈవో ఆదేశాల మేరకు ప్రధాన ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారు. పాఠశాల అభివృద్ధికి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలకు విద్యార్థులలో క్రమశిక్షణకు తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో షకీల్, మురళి, దేవిక, రామానుజులు, హసీనా,, హైదర్ వల్లి, వాత్సల్య, కవిత, రవీంద్ర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువులనూ వదల్లేదు

**మట్టితో పూర్తిగా కప్పేసిన చిన్నాన్న కర్ర చెరువు**

**కోటబొమ్మాళి మండలంలో జోరుగా ఆక్రమణలు**

**ఆయకట్టుదారులకు తప్పని సాగునీటి కష్టాలు**



కోటబొమ్మాళి, ఆగస్టు 16(టుడే విదుర): కోటబొమ్మాళి మండలంలో ఆక్రమణలకు అడ్డులేకుండా పోయింది. ఖాళీ స్థలాలే కాదు.. చెరువులు, బందలు, కోనేరులు సైతం ఆక్రమణకు గురై నామరూపాలు లేకుండా పోతున్నాయి. ఇటీవల కోటబొమ్మాళి పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 237/2లో సుమారు రెండు ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న చిన్నాన్న కర్ర చెరువు కబ్జాకు గురైంది. అక్రమార్కులు అంచెలంచెలుగా చెరువును ఆక్రమిస్తూ చెరువు గర్భాన్ని ఇప్పుడు పూర్తిగా మట్టితో కప్పేశారు. ఈ చెరువు కింద సుమారు 45 ఎకరాల ఆయకట్టు సాగవుతుండేది. ఇప్పుడు చెరువు పూర్తిగా నామరూపాలు లేకపోవడంతో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీనిపై ఇప్పటికే స్థానికులు కొంతమంది రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు పరిశీలించి.. పనులు నిలుపుదల చేశారు. కాగా, మండలంలోని చాలాచోట్ల చెరువులు, బందలు, కోనేరులు ఆక్రమణకు గురవుతున్నాయని ఈ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వాటిని పరిరక్షించాలని కోరుతున్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ అప్పలరాజు వద్ద ప్రస్తావించగా.. చిన్నాన్న కర్ర చెరువు ఆక్రమణ విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆక్రమణలు పరిశీలించామని బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# ఈ వార్డెన్ మాకొద్దు



**విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాదరావు**

**ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతిగృహ విద్యార్థినుల ఆందోళన**

**విచారణకు వెళ్లిన అధికారులను అడ్డుకున్న వార్డెన్**

ఆగస్టు 16(టుడే విదుర): స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహ విద్యార్థినులు ఆందోళన చేశారు. స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహంలో వాచ్‌మన్(మహిళ)పై వార్డెన్ సుశీల దాడిచేయడంతో అలజడి నెలకొంది. ఈ నేపథ్యంలో బాలిక లు అధికారులకిచ్చిన సమాచారం మేరకు కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, ఇతర అధికారులతో కలిసి వసతిగృహాన్ని సందర్శం చేందుకు సాయంత్రం వచ్చారు. అయితే సెలవురోజున విజిట్ చేయడాని మీరెవరంటూ సుమారు అరగంటపైబడే లోపలకు రానీయకుండా వాదించారు. దీంతో పోలీసుల సాయంతో తహసీల్దార్ వసతి గృహం లోపలకి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. ఈ వార్డెన్ మాకొద్దంటూ విద్యార్థినులు పడు తునన అవస్థలు వివరించారు. వార్డెన్ బూతులు తిడుతుందంటూ వాపోయా రు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి ముందుకొస్తే బెదిరిస్తుందని తెలి పారు. కలెక్టర్, డీడీలకే కాలర్ పట్టుకు అడిగేదానిని మీరెంత అంటూ ఎవైనా ఫిర్యాదు చేస్తే తరువాత ఉంటాది జాగ్రత్త అని హుకుం చెలాయిస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వార్డెన్ మేడం, మనుమల బట్టలు సైతం మాచేతనే ఉతికిస్తుందని, లేకుంటే కొడతారన్నారు. సాయంత్రమైతే చాలు వసతిగృహం నుంచి సరుకులు మూటలుగా బయటకు తరలిపోతున్నాయని తెలిపారు. మెనూ పాటించకుండా రోజూ వంకాయ కూరే పెడుతున్నారన్నారు. మరమ్మతు పనులు కూడా మాచేతే చేయిస్తుంటరన్నారు. వార్డెన్ కారుడ్రైవర్ ఎప్పుడూ హా స్టల్‌లోనే ఉంటాడు. హాస్టల్‌లో మారూములలోనే తిరుగుతూ ఉండడం కొన్ని సార్లు ఇబ్బందిగా ఉంటుందన్నారు. అదే మాపేరెంట్స్ వస్తే లోపలికి కూడా రానీయడం లేదని వాపోయారు. హాస్టల్‌లో ఉండడం చాలా ఇబ్బందిగా ఉంద న్నారు. దీనిపై ఏఎస్‌డబ్ల్యూవో శ్యామలను తహసీల్దార్ ప్రశ్నించగా.. పలుమా ర్లు షోకాజ్ నోటీసులు ఇచ్చినా తిరిగి సమాధానం లేదని, ఉ న్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈవార్డెన్ ఉ ంటే మేము హాస్టల్‌లో ఉండలేమని వెంటనే మార్చేయాలని విద్యార్థినులంతా ఉమ్మడిగా తహసీల్దార్‌ను కోరారు. ఎంపీడీవో పి.చంద్రకుమారి, ఎస్ఐ బి.లావణ్య తదితరులు ఉన్నారు.

# వేర్వేరు ఘటనల్లో 20 కిలోల గంజాయి స్వాధీనం



పలాస,ఆగస్టు 16(టుడే విదుర): వేర్వేరు రెండు ఘటనల్లో 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఒడిశాకు చెందిన ఐదుగురుని అరెస్ట చేసినట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. ఆయన ఇందుకు సం బంధించిన వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం మోహన్‌బ్లాక్ రాయ్‌జుకా గ్రామానికి చెందిన అనిసెంట్ నాయక్, బురుంగసాహి గ్రామానికి చెందిన మోహిత్ బిరా, మోహనబ్లాక్‌కు చెందిన రబిత్ బిర్లా స్నేహితులు. వీరు కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్యాముల్‌తో కలిసి గంజాయి వ్యాపారాన్ని ప్రారంభించారు. కిలోకు రూ.8 వేలు చొప్పున ఒడిశావాసులు ఇస్తుండడంతో దీన్నే వ్యాపారంగా చేసుకున్నారు. ఈ క్రమంలో రాత్రి పలాస రైల్వేస్టేషన్ వద్ద పది కిలోల గంజాయితో రైలు ఎక్కేందుకు సిద్ధం కావడంతో కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహామూర్తి తన సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా వారు పట్టుబడ్డారు. వీరి నుంచి పది కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా గుమ్మా, అదవ గ్రామాలకు చెందిన సురుసింగ్, సమిత్ అభిహోయ్ సంతల్లో పండ్లు కొనుగోలు చేసుకొని ఇతర ప్రాంతాలకు అమ్ముతూ స్నేహితులయ్యారు. వీటితోపాటు గంజాయి రవాణా చేస్తే అధిక డబ్బులు సంపాదించవచ్చని భావించారు. ఈ క్రమంలో పలాస రైల్వే స్టేషన్ వద్ద బ్రోకర్లకు గంజాయిని అప్పగిస్తే కిలోకు రూ.వెయ్యి ఇస్తారని సురుసింగ్‌కు అభిహోయ్ చెప్పాడు. దీంతో ఢిల్లీలో ఉండే బ్రోకర్ సులాత్‌పాఠికి పది కిలోల గంజాయిని అప్పగించడానికి బైక్‌పై పలాస రైల్వేస్టేషన్‌కు వస్తుండగా సురుసింగ్, సులాత్ పాణి పట్టుబడ్డాడు. గంజాయి స్వాధీనం చేసుకుని వీరిని అరెస్టు చేశారు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ నర్సింహామూర్తి, సిబ్బందిని సీఐ అభినందించారు.

# సత్యసాయి జిల్లాలో ఉగ్రవాదుల కలకలం




ఆగస్టు 16(టుడే విదుర): ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లాలో ఉ గ్రవాదుల కదలికలు కలకలం సృష్టించాయి. ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో ఎన్ఐఏ అధికారులు ఓ యువకుడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం.. దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలపై నిఘా పెట్టిన ఎన్ఐఏకు ధర్మవరంలోని కోట కాలనీలో నివాసం ఉంటున్న నూర్‌పై అనుమానం వచ్చింది. ఎన్ఐఏ అధికారులు ఓ హోటల్‌లో వంటమనిషిగా పని చేస్తున్న నూర్ కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టారు.పక్కా సమాచారంతో రెండు రోజుల క్రితం అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడి ఇంట్లో జరిపిన సోదాల్లో ఏకంగా 16 సిమ్ కార్డులు బయటపడ్డాయి. అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. నూర్ సోషల్ మీడియా ఖాతాలపై నిఘా ఉంచారు. ఉ గ్రవాదులతో నూర్‌కు ఉన్న సంబంధాలపై మరింత లోతుగా ఆరా తీస్తున్నారు. ఉ గ్రవాదులతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో నూర్‌ను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేసిన ఘటనతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

# మేడ్చల్ సరోగసీ కేసు.. వెలుగులోకి సంచలన విషయాలు

ఆగస్టు 16(టుడే విదుర): మేడ్చల్ జిల్లాలో అక్రమంగా సరోగసీ దందా నిర్వహిస్తున్న ఒక ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. అక్రమ సరోగసీ వ్యవహారానికి అంగీకరించిన మహిళలతో సహా మొత్తం తొమ్మిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో రూ.6.74 లక్షల నగదు, కొన్ని బాండ్ పేపర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు లక్ష్మి, ఆమె కుమారుడు నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు

అద్దె గర్భం మోయడానికి అంగీకరించిన మహిళల చేత నిందితురాలు లక్ష్మి, నరేందర్ రెడ్డి ప్రామిసరీ బాండ్ పేపర్లు రాయించుకున్నారు.



అద్దెగర్భానికి అంగీకరించిన ఒక్కో మహిళకు రూ.5 లక్షలు చొప్పున ఇస్తున్నారు. ఇక, సరోగసీ ద్వారా పిల్లలను కనాలనుకుంటున్న తల్లిదండ్రుల నుంచి రూ.20 నుంచి 25 లక్షలు తీసుకుంటున్నారు. గతంలో ఇదే కేసులో లక్ష్మిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. జులై నుంచి విడుదలైన లక్ష్మి తిరిగి హైదరాబాద్‌లో అదే దందా కొనసాగిస్తోంది.పోలీసుల సోదాల్లో ఘటనా స్థలంలో ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, గర్భధారణ మందులు, హార్మోన్ ఇంజక్షన్లు లభ్యమయ్యాయి. ఐవీఎఫ్ సెంటర్‌కు వచ్చిన దంపతుల వివరాలను లక్ష్మి ఏజెంట్ల ద్వారా సేకరిస్తోంది. వారిని సరోగసీ వైపు ఆకర్షించి డబ్బులు సంపాదిస్తోంది. లక్ష్మి ఇల్లు సహా అను టెస్ట్ ట్యూబ్ సెంటర్, శ్రీ ఫెర్టిలిటీ, అమూల్య ఫెర్టిలిటీ సెంటర్‌కు సంబంధించిన కొన్ని రిపోర్ట్ పేపర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలు ఐవీఎఫ్ హాస్పిటల్స్‌తో లక్ష్మికి ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# రాత్రివేళ దంచికొట్టింది..



హైదరాబాద్ సిటీ:ఆగస్టు 16(టుడే విదుర): నగరంలో రాత్రి పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లపై వరద ప్రవాహం కనిపించింది. ప్రధాన రహదారులు, లోతట్టు ప్రదేశాల్లో ఇబ్బందులు తలెత్తాయి. కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, కూకట్‌పల్లి, గాజులరామారం, శేరిలింగంపల్లి, మియాపూర్, చందానగర్, లింగంపల్లి, మాదాపూర్ గచ్చిబౌలి, రాయదుర్గం, నల్లగండ్ల, హఫీజ్‌పేట్, కొండాపూర్, గోపన్‌పల్లి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో పడిన వర్షంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. %కూకట్‌పల్లి, ఆల్విన్ కాలనీలో రోడ్లపై మోకాలి లోతువరకు నీరు నిలిచింది.. జల వాయువిహార్ కాలనీలో రోడ్డుకు అడ్డంగా చెట్లు విరిగిపడ్డాయి. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఇదిలా ఉండగా, రామంతాపూర్, హబ్సిగూడ, తార్నాక, మల్కాజిగిరి, ఈసీఐఎల్ ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది.

# ట్రాన్స్‌జెండర్లకు జీహెచ్‌ఎంసీ అండ..



హైదరాబాద్ సిటీ:ఆగస్టు 16(టుడే విదుర): సమాజంలో ఇన్నళ్లూ వివక్షకు గురైన వారికి ఇప్పుడు చేయూత లభిస్తోంది. ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కొందరు ముందుకు వస్తున్నారు. స్వయం ఉపాధి పొందేందుకు వారిలో ఇంకొందరు సిద్ధమవుతున్నారు. ఇదంతా ట్రాన్స్‌జెండర్ల విషయంలో సమాజంలో వస్తున్న మార్పు, వారికి(ట్రాన్స్‌జెండర్ల) భవితపై కలుగుతున్న నమ్మకానికి నిదర్శనం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల నేపథ్యంలో ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ విభాగాలు చొరవ చూపుతున్నాయిఓ సంస్థతో కలిసి జీహెచ్‌ఎంసీ 155 మంది ట్రాన్స్‌జెండర్లకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చింది. వారిలో 151 మంది స్వయం ఉపాధి పొందేందుకు బ్యాంకు రూ.1.50 కోట్ల రుణం అందించడంలో బల్దియా కీలకంగా వ్యవహరించింది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ విభాగంలో ఇప్పటికే 38 మంది ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు.జీహెచ్‌ఎంసీ సహకారంతో చందానగర్‌లో లైట్ హౌస్ కమ్యూనిటీస్ నైపుణ్య కేంద్రంలో నిరుద్యోగులకు కొన్నాళ్లుగా ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా నలుగురు ట్రాన్స్‌జెండర్లు మధురాజ్, ఇమ్రాన్‌ఖాన్, నవీన, వరుణ్‌తేజ్‌లో ఆ కేంద్రంలో గ్రాఫిక్ డిజైన్ కోర్సుల్లో 15 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆ నలుగురికి మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌లు జాబ్ ఆఫర్ లెటర్లు అందించారు.

# చిగురుమామిడిలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు.. ఆకట్టుకున్న చిన్నారుల వేశధారణ

చిగురుమామిడి, ఆగస్టు 16(టుడే విదుర): కృష్ణాష్టమి పర్వదినం పురస్కరించుకొని చిగురుమామిడి మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చిగురుమామిడి, రేకొండ, బొమ్మన పల్లి, గాగిరెడ్డిపల్లి, ఇందుర్తి, తదితర గ్రామాల్లో చిన్నారులు కృష్ణుడు గోపికల వేషధారణలతో అలరించారు. మండల కేంద్రంలోని డార్విన్ స్కూల్లో చిన్నారులు వేషధారణలతో పలువురిని అలరించారు. %ప్రతీ ఏటా కృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండుగగా



నిర్వహిస్తామని పాఠశాల కరస్పాండెంట్ సమ్మిరెడ్డి తెలిపారు. కాగా పలు గ్రామాల్లో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లవారుజామునే దేవాలయాలకు వెళ్లి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ట్రాఫిక్ మార్షల్స్.. పోలీసులకు ప్రత్యామ్నాయంగా రద్దీ ప్రాంతాల్లో విధులు

హైదరాబాద్ సిటఆగస్టు 16(టుడే విదుర): హైదరాబాద్ లో ట్రాఫిక్ కష్టాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఉదయం 7 గంటలకు మొదలయ్యే ట్రాఫిక్ ఇబ్బందులు అర్ధరాత్రి దాటేంత వరకు వెంటాడుతూనే ఉంటాయి. ఈ క్రమంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రత్యేకంగా కొన్ని ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను ఎంపిక చేసి, ఆయా ప్రాంతాల్లో సుమారు 100 మంది ట్రాఫిక్ మార్షల్స్‌ను రంగంలోకి దింపాలని నిర్ణయించారు. %పలు ఐటీ కంపెనీలు, పెద్ద కార్పొరేట్ ఆసుపత్రులు, జనసమ్మర్థం ఎక్కువగా ఉన్న ప్రైవేట్ సంస్థల వద్ద ప్రత్యేకంగా ట్రాఫిక్ మార్షల్స్‌ను ఏర్పాటు చేయాలని సీపీ నిర్ణయించారు. సిబ్బంది సరిపోకపోవడం, జంక్షన్ల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కష్టంగా ఉండటంతో ప్రైవేట్ సంస్థలు, కంపెనీల వద్ద పోలీసులు విధులు నిర్వహించడం కష్టంగా మారుతోంది. అలాంటి ప్రాంతాల్లో ఆయా సంస్థలే ముందుకు వచ్చి కొంతమంది సిబ్బందిని నియమించుకోవాలని సీపీ సూచించారు. %సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ)లో భాగంగా సిబ్బందిని నియమించుకుంటే..



వారిని ట్రాఫిక్ పోలీసులకు అనుసంధానం చేస్తామని సీపీ వెల్లడించారు. వారికి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, విధులపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి మార్షల్స్‌గా తయారు చేస్తామని పేర్కొన్నారు. సీపీ ఆదేశాలతో పదుల సంఖ్యలో సంస్థలు ముందుకొచ్చినట్లు తెలిసింది. మొత్తం 100 ట్రాఫిక్ మార్షల్స్‌ను ఎంపిక చేయాలని సీపీ నిర్ణయించగా, ఇప్పటికే 70 మందిని ఎంపిక చేసి సిటీ పోలీసులకు అనుసంధానం చేశారు.

# ఓదెలలో రైలు కిందపడి ఆత్మహత్య



ఆగస్టు 16(టుడే విదుర): పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రానికి చెందిన ఐలు రాజు గౌడ్(41) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. రైల్వే పోలీస్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాజు గౌడ్ తన కులవృత్తి అయిన కలాలితోపాటు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. %అయితే కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నట్టు కుటుంబీకులు తెలిపారు. తన వ్యవసాయ భూముల సమీపంలో రైల్వే ట్రాక్ ఉండగా అక్కడ రైలు కిందపడి మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

# కనకగిరి అడవుల్లో నీలిరంగు పుట్టగొడుగు

సత్తుపల్లి(ఖమ్మంఆగస్టు 16(టుడే విదుర): న్యూజిలాండ్ దేశానికి చెందిన ఎంటోలోమా హొచెస్టెటెరీ జాతికి చెందిన నీలి ఆకాశ పుట్టగొడుగు (స్కైబ్లూ మష్రూమ్) మన కనకగిరి అడవుల్లో మొలకెత్తింది. ఈ విషయాన్ని ఎఫ్‌డీవో వాడపల్లి మంజులి వివరించారు. సత్తుపల్లి ఫారెస్ట్ డివిజన్‌లోని పెనుబల్లి, కల్లూరు మండలాల్లో విస్తరించి ఉన్న కనకగిరి హిల్స్‌లోని పులిగుండాల వద్ద ఈ అరుదైన మష్రూమ్ మొలకెత్తిందన్నారు. దీనిని ఆహారంగా తీసుకున్నట్లయితే పాయిజన్‌లా మారుతుందని చెప్పారు.పులిగుండాల ప్రాజెక్టుకు సమీపంలో



ఉన్న పురాతన శివాలయం (గుండెపూడి) వెనుక దట్టమైన అటవీ ప్రాంతంలో ఈ మష్రూమ్‌ను కనుగొన్నట్లు పేర్కొన్నారు. విలక్షణమైన రంగు కలిగి ఈ నీలి ఆకాశ పుట్టగొడుగు అరుదైన లక్షణమైన అజులీన్ వర్ణ ద్రవ్యాల వల్ల కలుగుతుందని, వర్షాకాలంలో తేమస్థాయిలకు అనుకూలంగా ఉన్నచోట్ల మొలకెత్తుతుందని అ?ధికారులు తెలిపారు. న్యూజిలాండ్ దేశంలో 2002లో జారీచేయబడిన యాభై డాలర్ల నోటుపై ఈ పుట్టగొడుగు చిహ్నంగా కనపిస్తుందని,ఇది ఒక సాప్రోబిక్ శిలీంద్రమని, సేంద్రీయ పదార్థాన్ని విచ్ఛిన్నం చేస్తుందని, అటవీ ప్రాంతంలో షోషకచక్రానికి దోహదం చేస్తుందని ఎఫ్‌డీవో తెలిపారు. తెలంగాణ అడవుల్లో జీవవైవిధ్యం సంరక్షించబడుతుందని, భవిష్యత్ తరాల కోసం, ఇతర పరిశోధనల కోసం మనం రక్షించాల్సిన ఆవశ్యకత ఉందని, ఇలా వివిధ రకాలు, జాతులకు చెందిన పశు పక్ష్యాదులు, జీవాలతో పాటు అరుదైన రకానికి చెందిన మొక్కలు మనకు దర్శనమివ్వడం సంతోషంగా ఉందన్నారు.

# మార్కెట్ ధర చెల్లించాలంటూ.. మామునూరు విమానాశ్రయం భూ నిర్వాసితుల ధర్న



కరీమాబాద్,ఆగస్టు 16(టుడే విదుర): మామునూరు విమానాశ్రయ భూసేకరణ వ్యవహారం రెండడుగులు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కి అన్నచందంగా సాగుతున్నది. ప్రభుత్వం చెల్లించే పరిహారం విషయంలో భూమిని కోల్పోతున్న రైతులు వెనక్కి తగ్గడం లేదు. ఇటీవల భూసేకరణకు నిధులు విడుదల చేసిన ప్రభుత్వం.. గుంటూరుపల్లి, గాడిపల్లి గ్రామాల రైతుల నుంచి భూమిని సేకరించాలని ఆదేశించింది. %ఒక ఎకరానికి రూ.1.20 కోట్లు చెల్లిస్తామని ప్రకటించింది. అయితే బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.5 కోట్ల విలువ చేసే భూమికి రూ.1.20 కోట్లు చెల్లించడం సబబు కాదంటూ రైతులు ఆందోళనకు దిగారు. తమ భూములకు న్యాయమైన ధర అందించాలని నక్కలపల్లి, గుంటూరు వల్లి రహదారి మధ్యలో రోడ్డుపై బైఠాయించారు. రహదారి సమీపంలో ఉన్న తమ భూములకు రూ.2 నుంచి రూ.3 కోట్ల వరకు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

# టుడే వినోదం

## ఘనవిజయం కోసం మెగా కాంపౌండ్ హీరోల ఎదురుచూపులు




మెగా కాంపౌండ్ రూపశిల్పులు చిరంజీవి, అల్లు అరవింద్ అనే చెప్పాలి. ఆ కాంపౌండ్ నుండి వచ్చిన ప్రతి హీరో సక్సెస్ వెనుక ఈ ఇద్దరూ ఉన్నారు. అంతలా అల్లుకు పోయిన ఆ బంధం ఈ మధ్య చెరిగిపోయిందని వినిపిస్తున్నా, చిరంజీవి, అల్లు అరవింద్ అనుబంధాన్ని మాత్రం ఎవరూ చెరిపేయలేరని అందరికీ తెలుసు. ఈ నేపథ్యంలోనే అల్లు అర్జున్ కు 'పుష్ప' సిరీస్ తో రెండు బంపర్ హిట్స్ సొంతమయ్యాయి. పైగా 'పుష్ప' మొదటి భాగంతో అల్లు అర్జున్ బెస్ట్ యాక్టర్ గా నేషనల్ అవార్డును కూడా సొంతం చేసుకున్నారు. తెలుగులో జాతీయ స్థాయిలో ఉత్తమ నటునిగా నిలచిన తొలి హీరోగా అల్లు అర్జున్ చరిత్రలో నిలచిపోయారు. అంతకు ముందే 'ట్రిపుల్ ఆర్'తో రామ్ చరణ్ 'గ్లోబల్ స్టార్' అయిపోయారని మెగాస్టార్ ఫ్యాన్స్ ఆనందిస్తూన్నారు. ఆ సమయంలోనే బన్నీ అవార్డు పట్టేశారు. ఆ తరువాత నుంచీ రామ్ చరణ్ కు సరైన సక్సెస్ పడలేదు. అలాగే చిరంజీవికి కూడా 'వాల్తేరు వీరయ్య' తరువాత ఆ స్థాయి సక్సెస్ దక్కలేదు.ఇక పవన్ కళ్యాణ్ విషయానికి వస్తే 2013లో వచ్చిన 'అత్తారింటికి దారేది' తరువాత ఆ రేంజ్ లో ఆయనకు విజయం లభించలేదు. ఆ తరువాత వచ్చిన సినిమాలన్నీ సో సో గానే సాగాయి. ఈ మధ్యే విడుదలైన 'హరిహర వీరమల్లు' సైతం పరాజయం పాలయింది. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ అభిమానులు ఆయన రాబోయే చిత్రం 'ఓజీ'పైనే ఆశలు పెట్టుకున్నారు. రామ్ చరణ్ కు 'ట్రిపుల్ ఆర్' తరువాత వచ్చిన సినిమాలేవీ ఆనందం పంచలేక పోయాయి. తండ్రి చిరంజీవితో కలసి నటించిన 'ఆచార్య' అంతే సంగతులు అనిపించుకుంది. ఇక శంకర్ దర్శకత్వంలో భారీగా రూపొందిన 'గేమ్ చేంజర్' కూడా నిరాశ పరచింది. అందువల్ల చెర్రీ ఫ్యాన్స్ ఆయన కొత్త చిత్రం 'పెద్ది'పై బోలెడు ఆశలతో ఎదురుచూస్తున్నారు.



## నాగ్, రజినీని మించి ఆ ఇద్దరు.. ఏం నటించారయ్యా

సాధారణంగా ఒక సినిమా హిట్ అయ్యింది అంటే అందరూ హీరో హీరోయిన్లకు పేరొస్తుంది. లేకపోతే డైరెక్టర్ కు పేరొస్తుంది. అయితే చాలా రేర్ గా హీరోను కూడా డామినేట్ చేసే రోల్స్ కొంతమందికి పడతాయి. వాటివలనే వారు కెరీర్ లో స్టార్ డమ్ ను అందుకుంటారు. అలా కూలీ సినిమాలో ఇద్దరు స్టార్స్.. హీరోను మించి అదరగొట్టేశారు. వారెవరు.. ? ఎందుకు వారికి అంత పేరు వచ్చింది అనేది చూద్దాం. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం కూలీ. సన్ పిక్చర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ సినిమా ఎన్నో అంచనాల నడుమ ఆగస్టు 14 న రిలీజ్ అయ్యి మిక్స్ టాక్ ను అందుకుంది లోకేష్.. ఇప్పటివరకు కోలీవుడ్ లో పరాజయం ఎరుగని దర్శకుడుగా ఎదిగాడు. కమల్ హాసన్ కు విక్రమ్ లాంటి సినిమా ఇచ్చి ఆయన కెరీర్ లో సెన్సేషన్ హిట్ ను అందించాడు. ఇక దీంతో పాటు %ాజఖ% అని స్టార్ట్ చేసి.. ఒక సినిమాతో ఇంకో సినిమాను లింక్ చేసి మరింత హైప్ క్రియేట్ చేశాడు. దీంతో లోకేష్ నుంచి ఒక సినిమా వస్తుంది




అంటే ప్రేక్షకులు అంచనాల నెక్స్ట్ లెవెల్ లో ఉంటాయి. అలానే అందరూ కూలీ మీద కూడా భారీ అంచనాలను పెట్టుకున్నారు. అందుకు కారణం.. లోకేష్ స్టార్ క్యాస్ట్ ను దింపడమే. ఇప్పటివరకు అక్కినేని నాగార్జున చేయని విలన్ పాత్రను లోకేష్ చేయించడంతో అటు కోలీవుడ్ ఇటు టాలీవుడ్ మొత్తం నాగ్ విలనిజం కోసంఎదురుచూసింది.



## అమ్మాయి అదృశ్యం వెనుక..?

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం 'కిష్కిందపురి'. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. షైన్ స్క్రీన్స్ బేనర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 12న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర టీజర్‌ను మేకర్స్ శుక్రవారం విడుదల చేశారు. టీజర్‌లో మొదటి షాట్ నుంచే మిస్టరీ ప్రారంభమవుతుంది. పురాతన బంగ్లాలోకి వెళ్లిన ఓ అమ్మాయి ఒక్కసారిగా అదృశ్యం అవుతుంది. ఇంతలో రేడియో నుంచి ఓ సమాచారం ప్రసారం అవుతుంది. మొత్తానికి టీజర్ ఆద్యంతం ఉత్కంఠతతో అదరగొట్టింది. చైతన్ భరద్వాజ్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ టీజర్‌ని మరో లెవల్‌కి తీసుకెళ్లింది.

## అలియా భట్ కోపానికి కారణం ఏంటి..




స్టార్స్ అంటే అందరికీ ఇష్టమే. వారు ఏం చేస్తున్నారు.. ? ఇళ్లలో ఎలా ఉంటారు.. ? వాళ్ల పిల్లలు ఎవరు.. ? ఇలాంటివన్నీ తెలుసుకోవాలని కుతూహలం ఉంటుంది. ప్రజలకు ఇలాంటి అప్డేట్స్ ఇవ్వడానికి ఫొటోగ్రాఫర్లు వారివెంట పడుతూనే ఉంటారు. లైక్స్, షేర్స్ కోసం ఎలాంటి పని అయినా చేయడానికి ఫొటోగ్రాఫర్లు సిద్ధమవుతున్నారు. అయితే స్టార్స్ కూడా మనుషులే. వారికి కూడా పర్సనల్ లైఫ్ ఉంటుంది. వారు కూడా ఆ ప్రైవేట్ లైఫ్ ను ఎంజాయ్ చేయాలనీ చూస్తూ ఉంటారు. ఇలా కెమెరామ్యాన్స్ వలన అలాంటి లైఫ్ దొరకడం లేదనే ప్ పెద్ద పెద్ద ఇళ్లకు అద్దాలు పెట్టించుకుంటున్నారు. అయినా కూడా వారి ఆగడాలు ఆగడం లేదు. %సెలబ్రిటీలు ఎక్కడకు వెళ్తే అక్కడకు వెంటవెళ్లి వారి పర్సనల్ ఫోటోలను తీయడం, వారి అనుమతి లేకుండా సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ఇదే పనిగా మారిపోయింది. కొందరు సెలబ్రిటీలు ఇలాంటివి కామన్ అని వదిలేస్తున్నారు. ఇంకొందరు కెమెరాల ముందే ఫైర్ అవుతున్నారు. తాజాగా అలియా భట్ ఫొటోగ్రాఫర్లపై ఫైర్ అయ్యింది. దానికి కారణం ఆమె పొట్టి డ్రెస్ ను అనుమతి లేకుండా ఫోటోలు తీయడమే కాకుండా సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ఒకటి అయితే .. ఇంటివరకు ఆమెను ఫాలో అవుతూ రావడమే కాకుండా లోపలికి తోసుకువచ్చి ఫోటోలు తీయడం.. ఆమెను ఇబ్బంది కలిగించింది. దీంతో అలియా ఓపిక నశించి వారిపై అసహనం వ్యక్తం చేసింది.

## మాస్ జాతర వాయిదా.. ఆ ప్లాపులే కారణమా

మాస్ మహారాజా రవితేజ , శ్రీలీల జంటగా భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం మాస్ జాతర( సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఈ సినిమా ఆగస్టు 27 న రిలీజ్ కు రెడీ అవుతోంది. సినిమా రిలీజ్ కు పట్టుమని పది రోజులు కూడా లేదు..




ఇప్పటివరకు ఈ సినిమా ప్రమోషన్స్ మొదలుపెట్టింది లేదు. మొదటి నుంచి ఈ సినిమా వాయిదా పడుతుందని వార్తలు వస్తున్నాయి. %ఇక మొదట్లో మాస్ జాతర రిలీజ్ డేట్ ను ఇంకా ప్రకటించక పోవడంతో వాయిదా పడుతుంది అనుకున్నారు. కానీ, సూర్యదేవర నాగవంశీ మాత్రం మాస్ జాతర ఎక్కడా తగ్గేదిలేదు కచ్చితంగా ఆగస్టులోనే వస్తుంది అని ఆగస్టు 27న రిలీజ్ కానుందని తెలిపారు. అందుకు తగ్గట్టుగానే మొన్నటివరకు టీజర్, సాంగ్స్ రిలీజ్ చేస్తూ సినిమాపై హైప్ పెంచుతూ వచ్చారు. ఇక ఇప్పుడు అందుతున్న సమాచారం ప్రకారం మాస్ జాతర వాయిదా పడిందని తెలుస్తోంది.

## అల్లు అర్జున్ ను మరచిపోవడమే కారణమా...!?

ప్రస్తుతం తెలుగు చిత్రసీమలోని కీలక వ్యక్తుల్లో అల్లు అరవింద్ ఒకరు... ఇక ఆయన తనయుడు అల్లు అర్జున్ పస్తుతం ఇండియాలోని టాప్ స్టార్స్ లో ఒకరిగా సాగుతున్నారు... గురువారం జరిగిన సైమా అవార్డ్స్ కర్టన్ రైజర్ ఈవెంట్ లో అల్లు అరవింద్ 9 ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు... అదే వేదికపై 2023 సంవత్సరానికి గాను 71వ నేషనల్ ఫిలిమ్ అవార్డ్స్ లో ఏడు అవార్డులు గెలుచుకున్న విజేతలను సైమా సంస్థ సన్మానించింది... ఇలా గౌరవించడం అభినందనీయమని అల్లు




అరవింద్ అన్నారు... మన తెలుగు సినిమా వారికి జాతీయ స్థాయిలో గౌరవం లభించినప్పుడు వారిని సన్మానించడం అన్నది గతంలో ఓ సంప్రదాయంగా జరుగుతూ ఉండేది... అది ఈ మధ్య కొరవడిందనే చెప్పాలి... ఆ విషయాన్నే అల్లు అరవింద్ తన ప్రసంగంలో గుర్తు చేశారు...




# క్రీడావార్తలు





## చరిత్ర సృష్టించిన 10 ఏళ్ల చిన్నారి ..
## గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించి సరికొత్త రికార్డ్



సాధారణంగా ఒక 10 ఏళ్ల చిన్నారి ఏం చేస్తుంది? స్కూల్‌కు వెళ్తుంది, ఆటలు ఆడుతుంది, టీవీ చూస్తుంది. కానీ, ఇక్కడ మనం చెప్పబోయే చిన్నారి బోధనా శివానందన్ మాత్రం తన అద్భుతమైన చెస్ ఆటతో అదరగొడుతోంది. ఇటీవల జరిగిన 2025 బ్రిటిష్ చెస్ చాంపియన్‌షిప్‌లో, ఈ 10 ఏళ్ల చిన్నారి గ్రాండ్‌మాస్టర్ పీటర్ వెల్స్ (వయసు 60) ను ఓడించి చెస్ ప్రపంచానికి షాక్ ఇచ్చింది. దీంతో చరిత్రలో గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించిన అత్యంత చిన్న వయస్కురాలిగా తన పేరు లిఖించుకుంది. భారత సంతతికి చెందిన బోధనాకు చెస్ పట్ల ఆసక్తి ఎలా వచ్చిందంటే, ఆమెకు 5 ఏళ్ల వయసులో ఒక చెస్ సెట్ బహుమతిగా లభించింది. అందులో తనకు క్వీన్స్ బాగా నచ్చాయంటా. అప్పటి నుంచే తన నాన్న సహకారంతో ఆట నేర్చుకున్నట్లు బోధనా తెలిపింది. దీంతోపాటు యూట్యూబ్ వీడియోలు చూసుకుంటూ నేర్చుకుంది. ఆ తర్వాత ఆమె స్థానిక టోర్నమెంట్లలో పాల్గొనడం ప్రారంభించింది. అలా ఆమె టాలెంట్ వెలుగులోకి వచ్చింది. ఆమె తల్లిదండ్రులు భారతదేశంలోని తమిళనాడు తిరుచిరాపల్లికి చెందిన వారు కాగా, ప్రస్తుతం లండన్?లో ఉంటున్నారు. ఆగస్ట్ 10, 2025న లివర్‌పూల్‌లో జరిగిన బ్రిటిష్ చెస్ చాంపియన్‌షిప్‌లో చివరి రౌండ్‌లో గ్రాండ్‌మాస్టర్ పీటర్ వెల్స్‌ను బోధనా ఓడించింది. ఆ రోజున ఆమె వయసు 10 సంవత్సరాలు, 5 నెలలు, 3 రోజులు. అంతకుముందు అమెరికన్ చెస్ ప్లేయర్ కారిస్సా యిప్ 2019లో 10 సంవత్సరాలు, 11 నెలలు, 20 రోజుల్లో ఒక గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించింది. ఇప్పుడు బోధనా ఆ రికార్డును బ్రేక్ చేసింది. బోధనా చెస్ గేమ్ గురించి తన అభిప్రాయం చాలా స్పష్టంగా చెబుతుంది. నాకు గొప్ప ప్లేయర్లతో ఆడటం ఇష్టం. ఎందుకంటే వాళ్ల దగ్గరి నుంచి నేర్చుకోగలుగుతాను. ఓడినా సరే, వాళు ఎలా ఆడుతున్నారో తెలుసుకుని నేనేం తప్పు చేశానో అర్థం చేసుకుంటానని తెలిపింది. ఇది తెలిసిన అనేక మంది ఇంత చిన్న వయసులో ఈ స్థాయి స్పష్టత, నైపుణ్యం ఉండటం నిజంగా గ్రేట్ అని మెచ్చుకుంటున్నారు.

## ఆస్ట్రేలియన్ క్రికెట్ దిగ్గజం బాబ్ సింప్సన్
## 89 ఏళ్ల వయస్సులో మృతి



ఆస్ట్రేలియన్ క్రికెట్ దిగ్గజాల్లో ఒకరైన బాబ్ సింప్సన్ శనివారం సిడ్నీలో 89 ఏళ్ల వయస్సులో కన్నుమూశారు మాజీ టెస్ట్ కెప్టెన్, ఆస్ట్రేలియా తొలి పూర్తి కోచ్‌గా విశేష సేవలందించిన సింప్సన్ మరణవార్తను క్రికెట్ ఆస్ట్రేలియా అధికారికంగా ప్రకటించింది. దీనిపై స్పందించిన క్రికెట్ ఆస్ట్రేలియా , దక్షిణాఫ్రికాతో జరగబోయే తొలి వన్డేలో ఆట ప్రారంభానికి ముందు నిశ్శబ్దంతో, నలుపు బ్యాడ్జీలు ధరించి నివాళులు అర్పించనున్నట్లు తెలిపింది. రోజర్ బాడ్లీ సింప్సన్ పేరుతో జన్మించిన బాబ్, కేవలం 16 ఏళ్ల వయస్సులోనే న్యూసౌత్ వేల్స్ తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అడుగుపెట్టారు. తర్వాత ఆయన 62 టెస్ట్‌లు ఆడి 4,869 పరుగులు చేసి, సగటు 46.81తో 10 శతకాలు, 27 అర్ధశతకాలు నమోదు చేశారు. ఓ మ్యాచులో అత్యధిక వ్యక్తిగత స్కోరు 311 పరుగులు. 1964లో ఇంగ్లాండ్‌పై ఓ అద్భుతమైన ఇన్నింగ్స్ రూపంలో గుర్తుండిపోయిందిబ్యాటింగ్ మాత్రమే కాదు, సింప్సన్ అద్భుతమైన స్లిప్స్ (110 క్యాచ్‌లు), అలాగే లెగ్ స్పిన్నింగ్ వేసి 71 వికెట్లు పడగొట్టాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఆయన 257 మ్యాచ్‌లు ఆడి 21,029 పరుగులు చేశారు. వీటిలో 60 శతకాలు, 349 వికెట్లు ఉన్నాయి. 62 టెస్ట్‌లలో 39 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించిన సింప్సన్, అతని భాగస్వామి బిల్ లారీతో కలిసి 382 పరుగుల ఓపెనింగ్ ఇప్పటికీ రికార్డుగా ఉంది. 1977లో వరల్డ్ సిరీస్ క్రికెట్ కారణంగా జట్టు బలహీనపడిన సమయంలో, సింప్సన్ 41 ఏళ్ల వయస్సులో రిటైర్మెంట్‌ను విడిచిపెట్టి మళ్లీ జట్టుకు నాయకత్వం వహించారు. ఆ క్రమంలో భారత్‌పై 3–2 విజయానికి జట్టు నాయకత్వం వహించడం ఒక కీలక ఘట్టంగా నిలిచింది. 1986 నుంచి 1996 వరకు సింప్సన్ ఆస్ట్రేలియా జాతీయ జట్టుకు ప్రధాన కోచ్‌గా పని చేశారు. 1987 వరల్డ్ కప్ విజయం, 1989లో ఇంగ్లాండ్‌లో అశెస్ విజయాలు, 1995లో వెస్టిండీస్‌ను వారి సొంతగడ్డపై ఓడించడం వంటి గొప్ప విజయాలు ఆయన కోచ్‌షిప్‌లోనే సాధ్యం అయ్యాయి.

## గర్ల్‌ఫ్రెండ్స్ పిల్లలను చదివిస్తున్నాడు.. కూతుర్ని చూడడం లేదు.. షమీపై భార్య తీవ్ర ఆరోపణలు..

టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీ మరోసారి వార్తల్లో నిలిచాడు. అతడి నుంచి విడిగా ఉంటున్న భార్య హసీన్ జాహన్ మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. షమీని స్త్రీలోలుడిగా అభివర్ణించారు. ప్రియురాళ్ల పిల్లలను మంచి స్కూళ్లలో చదివిస్తూ, కన్నకూతురి చదువును మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. షమీకి, హసీన్ జాహన్‌కు ఐరా అనే కుమార్తె ఉన్న సంగతి తెలిసిందే. ఐరాకు ఓ ఇంటర్నేషన్ స్కూల్‌లో సీటు వచ్చిందని చెబుతూనే, షమీపై జాహన్ తీవ్ర ఆరోపణలు చేశారు. 'ఐరా తండ్రి ఓ బిలియనీర్. అయినా కూతురి స్కూల్ ఫీజుకు మాత్రం డబ్బులు ఇవ్వడు. ఉంపుడుగత్తెల పిల్లలను మంచి స్కూళ్లలో చదివిస్తున్నాడు. కూతురి చదువుకు మాత్రం డబ్బులు లేవని చెబుతున్నాడు. తన గర్ల్‌ఫ్రెండ్స్‌ను విమానాల్లో బిజినెస్ క్లాస్‌ల్లో తీసుకెళ్లడానికి లక్షలు ఖర్చు చేస్తాడు.




కూతురుని మాత్రం పట్టించుకోడు. అతడు ఒక స్త్రీలోలుడు' అని హసీన్ జాహన్ విమర్శించారు. మాజీ మోడల్ అయిన జాహన్ 2014 లో మహ్మద్ షమీని వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు 2015లో ఒక కూతురు పుట్టింది. మహ్మద్ షమీపై గృహ హింస ఆరోపణలు చేస్తూ హసీన్ జాహన్ 2018 నుంచి షమీకి దూరంగా ఉంటున్నారు. కాగా, షమీ నెలకు రూ.4 లక్షల భరణం చెల్లించాలని కలకత్తా హైకోర్టు ఇటీవల ఆదేశించింది.

## మరో ఇద్దరు టాప్ ఆటగాళ్లతో ఎక్స్చేంజ్ ఆఫర్..





భారత జట్టుకు చిన్న విరామం ఉన్న సమయంలో ఐపీఎల్ పుకార్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అత్యంత డిమాండ్ ఉన్న ఆటగాడు రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్, భారత %20×% ఓపెనర్ సంజు సామ్సన్ గురించి కీలక విషయం తెలిసింది. కోల్‌కతా నైట్ రైడర్స్ లో శాంసన్ చేరినట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది పోటీకి వేలానికి ముందే ఆర్ఆర్ కెప్టెన్ ఎంపిక ఉన్న నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. రఘువంశీ లేదా రమణ్‌దీప్ సింగ్ వంటి హై ప్రొఫైల్ ఆటగాళ్లను రాజస్థాన్‌కు ఇచ్చి సంజును తమ టీమ్‌లోకి కేకేఆర్ తీసుకోవాలని యోచిస్తోందంటా. ఇందులో రమణ్‌దీప్ గత సంవత్సరం ఇండియా తరఫున అరంగేట్రం కూడా చేశాడు. కానీ వీళ్ళిద్దరూ రాజస్థాన్‌కి అవసరమా అన్నది ప్రశ్న. ఎందుకంటే %==%కి ప్రస్తుతం అవసరమైనది స్పష్టమైన పేస్ బౌలింగ్, లోయర్ మిడిల్ ఆర్డర్‌లో నమ్మదగిన బ్యాటింగ్ కావాలి. కానీ ఈ ఇద్దరి స్టైల్ ఆ అవసరాలకు పూర్తిగా సరిపోరు. అయినా ఫ్యూచర్ ఇన్‌వెస్ట్మెంట్‌గా చూసుకుంటే మాత్రం వారు ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. సంజు సామ్సన్ పేరున్న ఆటగాడు. భారత జట్టులో టీ20 ఓపెనర్‌గా వెలుగొందుతున్న అతను, ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు కెప్టెన్‌గా కూడా సేవలందిస్తున్నాడు. ఈసారి మాత్రం సంజును సంపాదించుకోవాలనే ఉత్సాహంలో ఇతర జట్లు బరిలో దిగాయి. ఇప్పటికే చెన్నై సూపర్ కింగ్స్ సంజును తమ టీమ్‌లోకి తీసుకునేందుకు ఆసక్తిగా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు కొలకతా నైట్ రైడర్స్ (%ఖఖ=%) కూడా సంజు కోసం రంగంలోకి దిగింది. సంజు సామ్సన్ 100% సరిపోయే ప్లేయర్. ఎందుకంటే వికెట్ కీపింగ్ విషయంలో బాధ్యతలు ఎక్కువగా తీసుకుంటాడు. కాబట్టి గుర్బాజ్ లేదా డికాక్‌లకు సెలక్షన్ కన్‌ఫ్యూజన్ తగ్గుతుంది. టాప్ ఆర్డర్ బ్యాటింగ్‌ని పెంచుకోవచ్చు. ఇండియన్ ప్లేయర్ కావడం వల్ల ఓవర్సీస్ స్పాట్‌ను సేవ్ చేసుకోవచ్చు. కానీ ఇక్కడ చిన్న ట్విస్ట్ ఉంది. సంజుకు కోసం ఏకంగా రూ.18 కోట్ల రిటైనర్ రేంజ్ ఉంది. కానీ %ఖఖ=% ఇచ్చే ఇద్దరు ప్లేయర్ల కలిపి విలువ కేవలం రూ.7 కోట్లు మాత్రమే. కాబట్టి ఈ ట్రేడ్‌కి ఇంకా ఎక్కువ ఇచ్చుకునే అవకాశం ఉంది. దీనిపై మరికొన్ని రోజుల్లో క్లారిటీ రానుంది.

## ఆరో స్థానంలో గుకేష్



లూయిస్ (యూఎస్ఏ): వరల్డ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నీలో ప్రపంచ చాంపియన్ గుకేష్ ఆరో స్థానానికి దిగజారాడు. బ్లిట్జ్‌లో తొలి తొమ్మిది రౌండ్లలో గుకేష్ ఒక విజయం సాధించి, నాలుగు గేమ్‌లు డ్రాగా ముగించాడు. దాంతో మొత్తం 13 పాయింట్లతో వియత్నాం గ్రాండ్‌మాస్టర్ లీమ్ లేతో కలిసి గుకేష్ సంయుక్తంగా ఆరో స్థానంలో నిలిచాడు.

## ఆ ముగ్గురు అదరగొట్టారు



బ్రిస్బేన్: ఓపెనర్ యాస్తిక భాటియా (66), కెప్టెన్ రాధా యాదవ్ (60), తనూజా కన్వర్ (50) అర్ధ సెంచరీలతో మెరవడంతో ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో వన్డే సిరీసను భారత్ 'ఎ' టీమ్ మరో మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. శుక్రవారం ఇక్కడ ఉత్కంఠగా జరిగిన రెండో మ్యాచ్‌లో 2 వికెట్లతో ఆతిథ్య జట్టును ఓడించింది. మొదట ఆసీస్ 50 ఓవర్లలో 265/9 స్కోరు చేసింది. అలీసా హీలీ (91), కిమ్ గార్త్ (41 నాటౌట్) రాణించారు. స్పిన్నర్ మిన్ను మణి 3, పేసర్ సైమా ఠాకూర్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 'ఎ' 49.5 ఓవర్లలో 266/8 స్కోరు చేసి గెలిచింది. ప్రేమా రావత్ (32 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడింది. ఎడ్గర్, హేవార్డ్, జార్జియా తలా 2 వికెట్లు తీశారు. ఛేదనలో 83/4తో ఇబ్బందుల్లో పడిన దశలో రాధ, యాస్తిక ఐదో వికెట్‌కు 68 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత ఓ దశలో మనోళ్లు 193/7 స్కోరుతో ఉండడంతో ఓటమి తప్పదేమోననిపించింది. అయితే తనూజ, ప్రేమ ఒత్తిడిని అధిగమించి ఎనిమిదో వికెట్‌కు 68 రన్స్ జోడించడం ద్వారా జట్టును విజయ తీరాలకు చేర్చారు

# ఆగస్టులో ధమాకా ఆఫర్.. వడ్డీ రేట్లను తగ్గించిన




దేశంలోని ప్రముఖ బ్యాంకులైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ ఆఫ్ బరోడా , ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక తమ కస్టమర్లకు గుడ్ న్యూస్ తెలిపాయి. ఎందుకంటే మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేటును తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో లోన్ తీసుకోవాలనుకుంటున్న వారికీ, ఇప్పటికే ఫ్లోటింగ్ రేట్ లోన్లు తీసుకున్న వారికీ ఇది శుభవార్త అని చెప్పవచ్చు. %వడ్డీ రేట్లు తగ్గితే నెలవారీ ఈఎంఐల భారం కొంత తగ్గనుంది. ప్రధానంగా హౌసింగ్ లోన్, కార్ లోన్, పర్సనల్ లోన్ తీసుకునే వారికి ఇది ఎక్కువగా ఉపయోగపడుతుంది. అయితే ఈ కొత్త రేట్లు ఎప్పటి నుంచి అనేది బ్యాంకులు ఒక లోన్‌కు కనీసంగా వసూలు చేయగల వడ్డీ రేటు. దీన్ని బ్యాంకులు తమ ఖర్చులు, ఆర్బీఐ రెపో రేటు ఆధారంగా నిర్ణయిస్తాయి. తగ్గితే, ఫ్లోటింగ్ వడ్డీ రేటుతో తీసుకున్న హెూం లోన్, పర్సనల్ లోన్‌లపై వంటి వాటిపై వడ్డీ తగ్గుతుంది. అంటే మీ నెలవారీ ఈఎంఐ భారం కూడా తగ్గుతుంది. %బాదీ×%లో హెూం లోన్ తీసుకుంటే ఎక్కువగా 1 మీద ఆధారపడుతుంది. కాబట్టి ఇది 8.80% నుంచి 8.75%కి తగ్గడం మంచి పరిణామం. కూడా తమ రేట్లను %బాదీ×% లాగే ఉంచింది. ఫలితంగా వినియోగదారులకు అదే స్థాయిలో ప్రయోజనం చేకూరనుంది. కంటే కొంచెం ఎక్కువే ఉన్నా, ఈ తగ్గింపు వల్ల %జువీ×%లో మాత్రం మార్పు రానుంది.

# మీ లోన్ ఇంకా మంజూరు కాలేదా.. ఇవి పాటించండి, వెంటనే అప్రూవల్




మీరు లోన్ కోసం అప్లై చేసినా కూడా ఇంకా మంజూరు కాలేదా. ఇలాంటి క్రమంలో మీరు కొన్ని విషయాలను తప్పకుండా తెలుసుకోవాలి. లోన్ అప్లై చేసే ముందు కొన్ని విషయాలు పాటించడం ద్వారా మీరు వేగంగా రుణం పొందే అవకాశం ఉంటుంది. మీరు చేసే చిన్న చిన్న తప్పులు మీకు లోన్ ఆలస్యంగా వచ్చేలా చేస్తాయి. అయితే ఆ తప్పులు ఏంటి, ఏం చేయకుండా ఉండాలనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.లోన్ అప్లై చేసేటప్పుడు సాధారణ తప్పు డాక్యుమెంట్ల సమర్పణలో జరుగుతుంది. ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఆదాయ రుజువు, బ్యాంక్ స్టేట్‌మెంట్ లేదా ఇతర ముఖ్యమైన పత్రాలు అసంపూర్తిగా ఉంటే, బ్యాంకు మీ అప్లికేషన్‌ను తిరస్కరించవచ్చు లేదా ఆలస్యం చేయవచ్చు. ఇలాంటి సమయంలో బ్యాంకు అడిగిన అన్ని డాక్యుమెంట్ల లిస్టును ముందుగా తెలుసుకుని, సరిగ్గా సమర్పించండి. డాక్యుమెంట్ల శాలరీ స్లిప్, స్టేట్ మెంట్ సహా అన్ని వివరాలను ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకుని సమర్పించండి. 2. సిబిల్ స్కోర్ సమస్యలు మీ సిబిల్ స్కోర్ లోన్ మంజూరులో కీలక పాత్ర పోషిస్తుంది. 750 కంటే తక్కువ స్కోర్ ఉంటే, బ్యాంకులు మీ అప్లికేషన్‌ను సీరియస్‌గా తీసుకుంటాయి. క్రెడిట్ కార్డ్ బిల్లులు ఆలస్యంగా చెల్లించడం, గతంలో తీసుకున్న లోన్ల రీపేమెంట్‌లో జాప్యం వంటివి సిబిల్ స్కోర్‌ను దెబ్బతీస్తాయి. లోన్ అప్లై చేయడానికి ముందే మీ సిబిల్ స్కోర్‌ను చెక్ చేసుకోండి. ఒకవేళ స్కోర్ తక్కువగా ఉంటే, క్రెడిట్ కార్డ్ బిల్లులు, ఇతర ఈఎంఐలను చెల్లించి స్కోర్ పెంచుకున్న తర్వాత అప్లై చేయండి. 3. తప్పుడు సమాచారం అప్లికేషన్ ఫారమ్‌లో తప్పుడు సమాచారం ఇవ్వడం మరో పెద్ద తప్పు. ఉదాహరణకు మీ ఆదాయం, ఉద్యోగ వివరాలు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని తప్పుగా ఇస్తే, బ్యాంకు వెరిఫికేషన్ సమయంలో మీ అప్లికేషన్‌ను తిరస్కరిస్తారు. ఎల్లప్పుడూ నిజాయితీగా సమాచారం ఇవ్వండి. బ్యాంకు ధికారులతో సంప్రదించి, మీ సమాచారం సరిగ్గా ఉందని నిర్ధారించుకోండి. 4. లోన్ గురించి స్పష్టత లేకపోవడం చాలామంది తమకు ఏ రకమైన లోన్ అవసరమో స్పష్టంగా నిర్ణయించుకోకుండా అప్లై చేస్తారు. ఉదాహరణకు హెూమ్ లోన్, పర్సనల్ లోన్, బిజినెస్ లోన్ ప్రతి లోన్‌కు భిన్నమైన అర్హతలు, డాక్యుమెంట్లు అవసరం అవుతాయి. మీ అవసరాలను బట్టి లోన్ రకాన్ని ఎంచుకోండి. బ్యాంకు అధికారులతో లేదా ఫైనాన్షియల్ అడ్వైజర్‌తో మాట్లాడి సరైన లోన్ ఎంపిక చేసుకోండి. 5. ఎక్కువ లోన్ అప్లికేషన్లు ఒకేసారి అనేక బ్యాంకులలో లోన్ కోసం అప్లై చేయడం వల్ల కూడా ఇబ్బందులు వస్తాయి. ఇది మీ సిబిల్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అలాంటి క్రమంలో బ్యాంకులు మిమ్మల్ని ఆర్థికంగా అస్థిరంగా భావించవచ్చు. అందుకే ఒకటి లేదా రెండు బ్యాంకులలో మాత్రమే అప్లై చేయండి. మీ అప్లికేషన్ తిరస్కరిస్తే, కారణాలను తెలుసుకుని తర్వాత కొన్ని రోజులకు అప్లై చేయండి .

# స్విగ్గీ ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు..ఫెస్టివల్ సీజన్‌లో వినియోగదారులపై ప్రభావం




మీరు గత కొన్ని రోజులుగా ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేస్తే బిల్ కొంచెం ఎక్కువగా అనిపించిందా? దీనికి మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఇండియాలో అగ్రగామిగా ఉన్న ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ, పలు ప్రాంతాల్లో తన ఫీజును రూ. 14కి పెంచింది ఇది దాదాపు 17% పెంపు. %కానీ ఇది తాత్కాలిక చర్య అని కంపెనీ చెబుతోంది. ఫెస్టివల్ సీజన్ సమయంలో కొన్ని హై డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ ఆర్డర్లను హ్యాండిల్ చేయడం కోసం ఈ ఫీజు పెంపు చేసినట్టు తెలుస్తోంది. ఇది లాంటి సర్జ్ ప్రైసింగ్ విధంగా అనిపించవచ్చు.స్విగ్గీ చెబుతోందే ఇది స్థిరమైన మార్పు కాదు. పండుగల సమయంలో మాత్రమే అమలవుతోంది. దీని తర్వాత అదే విధంగా కొనసాగుతుందా లేదా అనేది ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. ఈ ప్లాట్‌ఫారమ్ ఫీజు 2023లో మొదట ప్రవేశపెట్టినప్పుడు కేవలం రూ. 2 మాత్రమే. ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో అది రూ. 14కి చేరింది, అంటే 600% పెరిగింది. ఇది చిన్నదిగా అనిపించిన ఫీజు ఇప్పుడు బాగా పెరిగింది. ప్రత్యర్థి జొమాటో మాత్రం తన ఫీజును ఇప్పటికీ రూ. 10 వద్ద కొనసాగిస్తోంది.ఇది ఒక్క స్విగ్గీ విషయంలోనే కాదు. ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ రంగంలో మొత్తం చూస్తే లాంటి సంస్థలు కూడా ప్లాట్‌ఫామ్ లేదా హ్యాండ్లింగ్ ఫీజులను మెల్లిగా పెంచుతున్నాయి. ప్రస్తుతం ఈ ఫీజులు రూ. 9 నుంచి రూ. 15 వరకు ఉన్నాయి.

## టుడే బిజినెస్

# మరింతగా తగ్గిన బంగారం ధర.. ఈ రోజు మీ నగరంలో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గ చూపుతుండడంతో బంగారం ధరలు ఇటీవల ఆల్‌టైమ్ గరిష్టానికి చేరువ అయ్యాయి (. అయితే ప్రస్తుతం మళ్లీ క్రమంగా కిందికి దిగివస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఆగస్ట్ 16న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1, 01, 230కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 92, 790కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే బంగారం ధర వంద రూపాయల మేర తగ్గింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 01, 380కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 92, 940కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 01, 230కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 92, 790కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

# జీఎస్‌టీలో మలివిడత సంస్కరణలు




న్యూఢిల్లీ: జీఎస్‌టీ వ్యవస్థను సమూలంగా సంస్కరించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని ప్రతిపాదనలు చేసింది. వచ్చే నెలలో జరిగే జీఎసటీ మండలి సమావేశంలో దీనిపై చర్చజరగనుంది. పన్ను ఎగవేతలు, బోగస్ ఇన్వాయిసలతో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) స్వాహాకు చెక్ చెప్పేలా ఈ సంస్కరణలు ఉంటాయని అధికార వర్గాలు చెప్పాయి. వేగంగా జీఎసటీ రిజిస్ట్రేషన్, రిటర్న్‌ల ప్రాసెసెంగ్, రిఫండ్‌ల క్లియరెన్స్ ఉండేలా ఈ సంస్కరణలు ఉంటాయని సమాచారం. ఈ సంస్కరణలను అధికార వర్గాలు 'మలివిడత జీఎసటీ సంస్కరణలు'గా అభివర్ణించాయి. ఈ సంస్కరణలతో జీఎసటీ పన్ను చెల్లింపుదారులపై కంప్లయెన్స్ (అమలు) భారం తగ్గుతుందని భావిస్తున్నారు. ఈ సంస్కరణల్లో భాగంగా కొత్త వ్యాపార సంస్థలు, స్టార్టప్ కంపెనీల జీఎసటీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మూడు రోజుల్లో పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అలాగే ఎగుమతిదారులు, ఇన్వర్టెడ్ డ్యూటీ చెల్లింపు విధానంలో ఉన్న జీఎసటీ చెల్లింపుదారులతో సహా 80 శాతం రిటర్న్‌ల రిఫండ్స్‌ను, రిటర్న్ ఫైల్ చేసిన వెంటనే వేగంగా క్లియర్ చేయాలని ప్రతిపాదించారు. ముందుగానే పూర్తి చేసిన రిటర్న్‌ల ద్వారా రిటర్న్‌ల ఫైలింగ్ ప్రక్రియ మరింత సులభమవుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006